క్లుప్తంగా

ఈకేవైసీ చేయించుకోవాలి



ఈకేవైసీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ రవి

అశ్వారావుపేటరూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉన్న వారంతా తప్పనిసరిగా ఈకేవైసీ ప్రక్రియను చేయించుకోవాలని అడిషనల్ డీఆర్‌డీఓ నల్లబోతుల రవి సూచించారు. గురువారం మండలంలోని వినాయకపురం గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొని చెత్తచెదారాన్ని తొలగించి శ్రమదానం చేశారు. అనంతరం శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ ఆలయం వద్ద భక్తుల కోసం స్వచ్ఛ భారత్ మిషన్ నిధులు రూ.3లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఆ తర్వాత అశ్వారావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అప్పారావు, కార్యదర్శి సందీప్, టెక్నికల్ అసిస్టెంట్ అస్మా, జీపీ సిబ్బంది ముత్తారావు, మధు పాల్గొన్నారు.

సాహిత్యపు పండుగలు ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జీయర్ మఠంలో భావనాప్రియ ఎనిమిదేళ్ల సాహిత్యపు పండుగలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ సాహిత్యోత్సవంలో వచనకవిత్వంపై తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ మేడిపల్లి రవికుమార్, చక్రవర్తి పద్యకవిత్వ వైభవాన్ని వరంగల్ విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ గిరిజామనోహరబాబు ఉదయం ప్రసంగించారు. మధ్యాహ్నం చక్రవర్తి గల్పికలలో విశేషాల గురించి విజయవాడ సిద్ధార్థ కళాశాల అధ్యాపకులు డాక్టర్ సశ్రీ ప్రసంగించగా.. చక్రవర్తి శతక సాహిత్యం అనే అంశంపై విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు నారాయణ మాట్లాడారు. కవిత్వంలోని మర్మాలను, లక్షణాలను వివరిస్తూ నేటి సాహిత్య స్థితిగతులను తులనాత్మకంగా వర్ణిస్తూ సాగిన ప్రసంగాలు శ్రోతలను అలరించాయి. కార్యక్రమంలో చక్రవర్తి, పాలపర్తి హవీలా, సుచరిత, బట్టు విజయ్ కుమార్, మండవ సుబ్బారావు, శిరంశెట్టి కాంతారావు, చిటితోటి విజయకుమార్, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు గురువారం డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ అభివృద్ధి పనులను పరిశీలించిన వారు.. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు పూనెం సరోజ, షబానాలు మాట్లాడారు. మహిళా నాయకురాళ్లు బొడ్డు సౌజన్య, కోరి శ్యామల, రెడ్డి బోయిన రేణుక, దేరంగుల సుజాత, కన్నాపురం వసంత, డాకూరి సౌజన్య, బాడిశ పార్వతి, కన్నాపురం శైలజ ఉన్నారు.

లాభాల వాటా పెంచాలని ధర్నా

మణుగూరురూరల్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా పెంచాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఇఫ్టూ) ఆధ్వర్యంలో గురువారం కాంట్రాక్ట్ కార్మికులు మణుగూరు ఏరియా సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.సీతారామయ్య మాట్లాడుతూ.. పర్మినెంట్ కార్మికులతో పాటు సింగరేణి ఉత్పత్తి కోసం శ్రమిస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఓబీ వర్కర్లకు, ప్రైవేట్ డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులకు సైతం లాభాలలో 15శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాసర్‌పాషా, ఇఫ్టూ నాయకులు ఎం.నాగేశ్వరరావు, ఏ.మంగీలాల్, కాంట్రాక్ట్ కార్మికులు వెంకటేశ్వర్లు, ప్రదీప్, నివాస్, దయాకర్, ప్రవీణ్, విజయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో మణుగూరు ప్రాంతానికి చెందిన వాసిరెడ్డి కృష్ణప్రసాద్-విజయలక్ష్మిలు తమ మనుమరాలు కుందనలు మొదటి పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. రామకృష్ణ-మైథిలి దంపతులు, తేజస్వి, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

పల్లెల్లో 'పంచాయతీ' సందడి

- స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మొగ్గు
- దూకుడుగా ఆశావహులు
- ఏర్పాట్ల హడావుడితో గ్రామాల్లో కళ



దుమ్ముగూడెంలోని మండల పరిషత్ కార్యాలయం..

దుమ్ముగూడెం: పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించక సుమారు రెండేళ్లు కావస్తుండటంతో అభివృద్ధి కుంటుపడింది. పంచాయతీ కార్యదర్శులు తమ శక్తికి మించి అప్పులు చేసి పాలన సాగిస్తున్నారు. ఇటీవల హైకోర్టు పంచాయతీ ఎన్నికలను సెప్టెంబర్‌లోగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించడంతో ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎన్నికల నిర్వహణకు కార్యాచరణ ప్రారంభించింది. దీంతో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీలో ఉండాలనుకుంటున్న ఆశావహులు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకుంటుండటంతో ఎన్నికలపై పల్లెల్లో సందడి నెలకొంది.

37 పంచాయతీలు..

స్థానిక ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీల వారిగా తుది ఓటర్ల జాబితాను ఖరారు చేశారు. ఈ నెల 2న సంబంధిత గ్రామపంచాయతీల వద్ద అధికారులు ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. మండలంలో మొత్తం 37 గ్రామపంచాయతీలు ఉండగా, మొత్తం 46,802మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 22,789 మహిళలు 24,013 మంది ఉన్నారు. మండలంలో 13 ఎంపీటీసీ, 1 జెడ్పీటీసీ, పంచాయతీ వార్డులు 324, పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలు 324 ఉన్నాయి.

పల్లెల్లో చర్చలు..

మండలంలో 37 పంచాయతీల పరిధిలో దాదాపు 114 గ్రామాలున్నాయి. ఇప్పటి వరకు అందుబాటులో లేని ప్రత్యేకాధికారుల పాలనతో ప్రజలు విసిగిపోయారు. ప్రస్తుతం ఎన్నికలకు ప్రభుత్వం లైన్ క్లియర్ చేయడం, ఇటీవల అధికారులు ఓటరు లిస్ట్‌ను ప్రకటించడంతో గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు. పంచాయతీ ఎన్నిలకు పూర్తయితే సర్పంచ్‌లు అందుబాటులో ఉంటారని, వారి ద్వారా కావాల్సిన పనులు నిర్వహించుకోవచ్చనే ఆలోచనలో ఉన్నారు. మరోవైపు, రిజర్వేషన్లపై ఇంకా స్పష్టత లేకపోవడంతో ఆశావహులు తమ కేడర్తో మంతనాలు జరుపుతున్నారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇవ్వడం, రిజర్వేషన్ల మీద క్యాబినేట్ ఆమోదం తెలపడం ఓవైపు, హైకోర్టు ఆదేశాలతో గతంలో ఉన్న రిజర్వేషన్ల మేరకే ఎన్నికలు జరుగుతాయనే వాదన మరోవైపు పల్లెల్లో వినిపిస్తోంది. ఏది ఏమైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న కొత్త ఆశావహులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

జవాబుదారీతనం ఉంటుంది..

గ్రామాల్లో ప్రజాప్రతినిధుల పాలన సాగకపోవడంతో ఎక్కడికక్కడ అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. జవాబుదారీతనం తప్పింది. పంచాయతీల్లో పాలక వర్గాలు ఉంటే బాధ్యాతాయుతమైన పాలన సాగుతుంది. ప్రజలకు కూడా అన్ని పనులు జరుగుతాయి. ప్రభుత్వం స్థానిక ఎన్నికల నిర్వహణకు మొగ్గు చూపుతుందని ప్రకటనలు రావడం హర్షించదగ్గ విషయం.

– ముర్రం వీరభద్రం, ఆదివాసీ సీనియర్ నాయకుడు

ప్రశాంతంగా రహదారులు

- మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో నిలిచిపోయిన ఇసుక లారీలు
- నిర్మానుష్యంగా కనిపిస్తున్న రోడ్లు



ప్రశాంతగా ఉన్న వెంకటాపురం- భద్రాచలం ప్రధాన రహదారి

చర్ల: మొన్నటి వరకు ఏ మాత్రం ఖాళీ లేకుండా రయ్యిమంటూ తిరిగిన ఇసుక లారీలు.. మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో నిలిచిపోయాయి. దీంతో రహదార్లు ప్రశాంతంగా కనిపిస్తున్నాయి. సెప్టెంబర్ 21 నుంచి 27 వరకు మావోయిస్టు పార్టీ 21వ ఆవిర్భావ దిన వారోత్సవాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో చర్ల, వెంకటాపేరం మండలాల్లో ఉన్న ఇసుక క్వారీలను పూర్తిగా మూసివేశారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే వెంకటాపురం-భద్రాచలం ప్రధాన రహదారి సోమవారం నుంచి నిర్మానుష్యంగా దర్శనమిస్తోంది. కాగా, లారీల రద్దీ, వేగంతో రెండు రోజులు ముందు వరకు రహదారిపై ప్రయాణించే ద్విచక్రవాహనదారులు, ఆటోవాలాలు, పాదచారులు ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని, భయం భయంగా రాకపోకలు సాగించారు. ప్రస్తుతం వారికి కొంత ఉపశమనం కలిగినట్టైంది. వారోత్సవాల అనంతరం సైతం ఇలాంటి వాతావరణమే కనిపించేలా లారీల తాకిడిని, వేగాన్ని నియంత్రించాలని స్థానిక ప్రజలు పోలీసులను వేడుకుంటున్నారు.

ఆదికర్మ సేవా కేంద్రాలు ప్రారంభం

బూర్గంపాడు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదికర్మ అభియాన్ కార్యక్రమంతో ఆదివాసీ గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని ఎంపీడీఓ జమలారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఉప్పుసాక, నకిరిపేట, కృష్ణసాగర్ గ్రామాలలో ఆదికర్మ సేవా కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధికి సంక్షేమ పథకాలను అందించటం, వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించటం ఆదికర్మ అభియాన్ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ఆదికర్మ గ్రామ సేవాకమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించి సమస్యలను గుర్తించారు. అధికారులు నాగరాజు, రాంబాబు పాల్గొన్నారు.



గ్రామాల్లో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

ఎట్టకేలకు విస్తరణ పనులు షురూ!



మున్సిపాలిటీ కార్యాలయ మార్గంలో కొనసాగుతున్న విస్తరణ పనులు

అశ్వారావుపేటరూరల్: గడిచిన కొద్ది నెలలుగా నిలిచిన రహదారి విస్తరణ నిర్మాణ పనులు ఎట్టకేలకు గురువారం నుంచి తిరిగి మొదలయ్యాయి. ఐదు నెలల క్రితం సుందరీకరణలో భాగంగా.. అశ్వారావుపేటలోని ఖాజా టీ స్టాల్ నుంచి మున్సిపాలిటీ కార్యాలయం వరకు రహదారి విస్తరణతోపాటు రెండు వైపులా డ్రెయినేజీ నిర్మాణాన్ని చేపట్టేందుకు జేసీబీలతో ఆక్రమణలను తొలగించారు. స్థానిక భగత్ సింగ్ సెంటర్ దాకా ఆక్రమణలను తొలగించిన తరువాత విస్తరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ మార్గంలో మున్సిపాలిటీ కార్యాలయం వరకు చేపట్టనున్న విస్తరణ పనులు గురువారం నుంచి మళ్లీ మొదలు పెట్టారు. ఈ రహదారిని భగత్ సింగ్ సెంటర్ దాకా నాలుగు లైన్లుగా, భగత్ సింగ్ సెంటర్ నుంచి ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌజ్ వరకు రెండు లైన్లుగా రోడ్డు విస్తరిస్తారు. అలాగే రోడ్డు సెంటర్ నుంచి 8.5 మీటర్ల వెడల్పుతోపాటు పొడవు సుమారు 150 మీటర్ల వరకు విస్తరించేందుకు గ్రీన్ సిగ్నల్ రావడంతో విస్తరించే పనులు పునఃప్రారంభించారు.

ఇందిరమ్మ ఇంటి పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఎస్టీ జాబితాలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ గురువారం తన క్యాంప్ కార్యాలయంలో ఇంటి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం కొరకు ప్రభుత్వం పట్టణంలోని 11 కుటుంబాలకు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బొగ్గా నారాయణ, పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుల నిర్మూలనకు కృషి చేయాలి

భద్రాచలంటౌన్: జ్యోతిరావు పూలే స్ఫూర్తితో కుల నిర్మూలనకు కృషి చేద్దామని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కెచ్చల రంగారెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కుల నిర్మూలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల అణచివేతతో పాటు దోపిడీ, పీడనను వివక్షను బీజేపీ నాయకత్వంలో మోదీ ప్రభుత్వం కొనసాగిస్తుందని ఆరోపించారు. ప్రజలు జ్యోతిరావు పూలేని స్ఫూర్తితో కుల నిర్మూలనకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మధుసూదన్ రెడ్డి, దాసరి సాయన్న, మునిగల శివప్రశాంత్, భాస్కర్, మహేశ్వరి, కుమారి, కృష్ణవేణి, రమాదేవి, షకీరా పాల్గొన్నారు.

మహిళలకు వైద్యశిబిరం

పినపాక: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించినట్లుగా డాక్టర్ దుర్గాభవాని తెలియజేశారు. మణుగూరు వంద పడకల ఆసుపత్రి గైనకాలజిస్ట్ అజంతా హాజరయ్యారు. 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 36 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డాక్టర్‌లు, వైద్య సిబ్బంది ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి వివరించారు. డాక్టర్ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

దీన్ దయాళ్ జయంతి

చర్ల: చర్లలో పండిట్ దీన్ దయాళ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు నూపా రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు బాబా పాహీం, జిల్లా కార్యవర్గ సభ్యులు గూనూరి రమణ, నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

ములకలపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో విరివిగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అనుమల సాయి డిమాండ్ చేశారు. విస్తృతంగా కురుస్తున్న వర్షాల వల్ల వీధుల్లో మురుగు నీరు నిలిచి, విషజ్వరాలు విజృంభిస్తున్నాయని అన్నారు. తక్షణమే హెల్త్‌క్యాంపులు నిర్వహించి, సత్వర వైద్య సేవలు అందించాలని అన్నారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

పినపాక: ఆర్టికల్ 34 ప్రకారం చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో జరిగిన ఆదివాసీ సంఘాల జేఏసీ సమావేశానికి జేఏసీ చైర్మన్ చుంచు రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న భద్రాచలంలో నిర్వహించే ఆదివాసీ సభకు భారీ సంఖ్యలో గిరిజనులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ మండల నాయకులు కొమరం శ్రీను, కొమరం అశోక్, కుంజా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

దమ్మపేట: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 28న నిర్వహించే చలో భద్రాచలం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి కొర్సా వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో గోడ పత్రికలను, ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు తెల్లం రామారావు, బండారు సూర్యనారాయణ, కుంజా చినబాబు పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు



జారే గుంపు, కొమరం ముత్యాలగుంపు గ్రామాల మధ్యన కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు

దమ్మపేట: ఇటీవల కురిసిన వర్షాలకు ఉధృతంగా ప్రవహించిన వరద నీటి కారణంగా మండలంలోని జారే గుంపు, కొమరం ముత్యాలగుంపు గ్రామాల మధ్యన బీటీ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో బీటీ రోడ్డు పక్కన పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనదారులకు రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రమాదకరంగా మారిన అప్రోచ్ రోడ్డుకు వెంటనే మరమ్మతులు నిర్వహించాలని, స్థానిక గిరిజనులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి

పినపాక: అసాంఘిక కార్యక్రమాలకు యువత, ప్రజల దూరంగా ఉండాలని ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో గురువారం గోదావరి పరివాహక ప్రాంతాలైన భూపతిరావుపేట, వెంకట్రావుపేట, చింతల బయ్యారం గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. చేపల వేటకు వెళ్లే జాలర్లను ఆరా తీశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా గ్రామాల్లోకి వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అసాంఘిక వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల పాత్ర కీలకం



ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఏరియా ఆస్పత్రి ఫార్మసిస్టుల

భద్రాచలంఅర్బన్: ఆస్పత్రిలో రోగులకు మందులు ఇచ్చే విషయంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ అన్నారు. ఫార్మసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆస్పత్రిలో కేక్ కట్ చేసి ఫార్మసిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఫార్మసీ సూపర్‌వైజర్ స్వరూపారాణి, ఫార్మసీ ఆఫీసర్లు మల్లికార్జున్ రావు, శ్రీనివాస్, కల్యాణితో పాటు సువర్ణ, వెంకటరమణ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన



గుండాల: వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

గుండాల: గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం పర్యటించారు. ఆయా మండలాల్లో రైతు వేదికలో వాటర్‌షెడ్ ద్వారా వ్యవసాయ పనిముట్లు, ఉపాధి హామీ పరికరాలతో పాటు, కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయాల్లో నమూన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులు స్వయంగా ఆన్‌లైన్ చేసుకోవాలని, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాసీం, అనూష, ఎంపీడీఓ బాలరాజు, శ్రీను, ఏపీఓ రఘునాథ్, రవితేజ, మిషన్ భగీరథ డీఈ పద్మ, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌కె.ఖధీర్, దారా అశోక్, కిరణ్, ముత్యామాచారి, పాంబోయిన ముత్తయ్య, చాట్ల పద్మ, కిరణ్, గణేష్, మోకాళ్ల బుచ్చ య్య, ఊకె. బుచ్చయ్య, చంద్రశేఖర్, రాజేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కరకగూడెంలో పర్యటన

కరకగూడెం: నేడు (శుక్రవారం) పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మండలంలో పర్యటించనున్నారని కరకగూడెం ఎంపీడీఓ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు భట్టుపల్లిలోని వడ్డెర కాలనీతో పాటు కలవల నాగారం గ్రామంలో నూతన అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. అధికారులు, గ్రామస్తులు సకాలంలో హాజరై పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

బతుకమ్మ వేడుకల్లో అంతర్రాష్ట్ర మహిళలు



అశ్వాపురం: గౌతమీనగర్ కాలనీలో బతుకమ్మ సంబురాల్లో మహిళలు

అశ్వాపురం: మినీ ఇండియాగా పిలువబడుతున్న భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో బతుకమ్మ వేడుకలు అంబరాలు అంటుతున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల మహిళలు ఒక్క చోటకు చేరి ఆటపాటలతో బతుకమ్మ ఆడుతున్నారు. బతుకమ్మ వేడుకలతో కాలనీలో సందడి నెలకొన్నది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చంద్రకళ, మాధవి, ప్రశాంతి, లావణ్య, కాలనీ, మహిళలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో బతుకమ్మ వేడుకలు

దమ్మపేట: మండలంలోని పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు దివాకర్ ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రిలోని మహిళ సిబ్బంది, తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలు, నృత్యాలతో ఉత్సాహంగా సంబురాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఉత్సవ ఏర్పాట్లలో ప్రభుత్వం విఫలం'

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర అస్తిత్వానికి ప్రతీరూపమైన బతుకమ్మ పండుగ ఉత్సవ ఏర్పాట్లను చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం సోషల్ మీడియా వేదికగా అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని ప్రతీకగా ప్రపంచ ఖ్యాతి పొందిన బతుకమ్మ పండుగకు నేడు గ్రామాల్లో కళ తప్పిందన్నారు. ప్రభుత్వం సరిపడా నిధులు కేటాయించకపోవడాన్ని విమర్శించారు.

రోడ్డు నిర్మించాలని నిరసన

దుమ్ముగూడెం: మండలంలోని అచ్చితాపురం గ్రామానికి లక్ష్మీనగరం గ్రామం నుంచి నిర్మించాల్సిన రహదారి నిర్మాణం ఆలస్యమవడంపై గురువారం అచ్చితాపురం గ్రామస్తులు నిరసన చేపట్టారు. ఆ రహదారిపై ఆందోళన నిర్వహించారు. గ్రామంలోకి వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా మారి రహదారి మధ్యలో ఉన్న కల్వర్టుకు భారీ గొయ్యి పడింది. నూతన రహదారి నిర్మాణం కోసం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభించకపోవడంపై స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. మా రోడ్డుకి మోక్షం ఎప్పుడు? అంటు ప్రశ్నించారు.

ఆదాయాన్ని ప్రజలకు పంచాలి

ములకలపల్లి: వన సంరక్షన సమితి (వీఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఉన్న జామాయిల్, వెదురు తోటలను నరికించి, ఆదాయాన్ని వీఎస్‌ఎస్ సభ్యులకు, స్థానిక ప్రజలకు పంచాలని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. వీకే.రామవరం శివారులోని యూకలిప్టస్, బాంబో తోటలను సీపీఎం బృందం గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 30 ఏళ్ల క్రితం అటవీ భూములు, సామాజిక అడవుల సంరక్షించాలని నాటి ప్రభుత్వం వీఎస్‌ఎస్‌లను ఏర్పాటు చేసిందని తెలిపారు. నేటికీ ఆయా చెట్లను నరకకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని ఆరోపించారు. వెంటనే తగుచర్యలు చేపట్టి, ఆదాయాన్ని పంచాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, పాడియం వెంకటేశ్వర్లు, మాలోతు రావూజా, నిమ్మల మధు, పాయం అమల, కుంజా భాస్కర్, హేమానీ పాల్గొన్నారు.

స్వచ్ఛతలో అధికారుల భాగస్వామ్యం

పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాల్లో పలు శాఖల అధికారులు గురువారం భాగస్వాములయ్యారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన స్వచ్ఛహీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆయా కార్యాలయాల్లో అధికారుల, సిబ్బంది శ్రమదానం చేశారు. పనికి రాని చెట్లు, మొక్కలను తొలగించి, చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. వక్తలు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తున్న అధికారులు, సిబ్బంది



చర్ల: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ అధికారులు, జవాన్లు



భద్రాచలంఅర్బన్: విద్యుత్ కార్యాలయ పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న డీఈ జీవన్ కుమార్



మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలో అధికారులు..



భద్రాచలంటౌన్: ఐటీడీఏ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఉద్యోగులు